క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

తాళ్లపూడి(కొవ్వూరు): రైతులు ప్రకృతి వ్యవసాయంపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు అన్నారు. మండలంలోని కాపవరం రైతు సేవా కేంద్రంలో గురువారం కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాలకు సంబంధించిన వీఏఏ, వీహెచ్ఏలకు ప్రకృతి వ్యవసాయ విధానంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో భాగంగా నేచురల్ ఫామింగ్ విధానంపై వివరించారు. డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, విజయ కుమార్, సుందర్ కుమార్, ఏవోలు వేణు, గంగాధర్, రుచిత పకృతి వ్యవసాయ కార్యకర్తలు హాజరయ్యారు.

ఇంటి వద్దకే వృద్ధులు, దివ్యాంగులకు రేషన్



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాయుడు

నల్లజర్ల: దివ్యాంగులు, వృద్ధులకు ఈ నెల 26 నుంచి 31వ తేదిలో ఇంటి వద్దకే రేషన్ తీసుకెళ్లి అందించాలని తహసీల్దార్ ఎస్.వి.ఎస్ నాయుడు డీలర్లకు సూచించారు. సివిల్ సప్లయి డీటీ సత్యనారాయణ అధ్యక్షతన గురువారం సాయంత్రం డీలర్ల సమావేశం జరిగింది. ఒకటో తేదీ నుంచి యధావిధిగా డిపో వద్ద రేషన్ సరుకుల పంపిణీ జరగాలన్నారు. రేషన్ పంపిణీపై సీఎం కార్యాలయం నుంచి ప్రజలకు వచ్చే ఐవీఆర్ కాల్స్‌పై లబ్దిదారులు సానుకూలంగా స్పందించే విధంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల డీలర్ల సంఘ అధ్యక్షుడు సీమకుర్తి నరసింహ మూర్తి, అచ్యుత భాస్కరావు,బాయిశెట్టి లక్ష్మణరావు,దూళిపాల వెంకన్న, మహేష్, నాగు తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి




శిక్షణ కార్యక్రమానికి హాజరైన వ్యవసాయాధికారులు

పెరవలి: జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగును విస్తరించేందుకు అన్ని వ్యవసాయ శాఖల సమన్వయంతో ముందుకు తీసుకువెళ్లటానికి రంగం సిద్ధం చేశామని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్–2 మహ్మద్ వల్లి తెలిపారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని గ్రామ వ్యవసాయాధికారులు, హార్టీకల్చర్ అధికారులకు ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ జిల్లాలో ఇప్పటి వరకు 46,770 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పంటలు పండిస్తున్నారని ఇందులో ప్రధాన భూమిక వరిపంటదేనని ఈ పంటను 32,550 ఎకరాల్లో సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రకృతి సాగును ఒక లక్ష ఎకరాలకు చేర్చాలనే ఉద్దేశ్యంతో అన్ని వ్యవసాయ శాఖల అధికారుల సమన్వయంతో లక్ష్యం నేరవేరేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కలసి రైతులను చైతన్య పరిచి మండల అధికారుల పర్యవేక్షణలో సాగు పెంచేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెరవలి, నిడదవోలు, ఉండ్రాజవరం వ్యవసాయాధికారులు మేరీ కిరణ్, సత్యనారాయణ, రాజారావు, గ్రామ వీఏలు, వీహెచ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

చాగల్లు: గత నెల 22న దేవరపల్లి ఉన్నత పాఠశాలో జిల్లా స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థినిలు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు తిరుపతి జిల్లా నాయుడుపేటలో జరిగే రాష్ట స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వి.వాసవీ విద్యార్థినులను అభినందించారు. పోటీల్లో జి.బేబీ లావణ్య, జి.సింధు, రమ్యశ్రీ వల్లి, వైష్ణవి, ప్రవల్లిక, పావని, జోష్ణవి, ఎం.మోహిని, నైమ, శైలజ, భావనిలు ఎంపికైనట్లు పీడీ తెలిపారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న టీచర్లు

పత్తాలేని ఫుడ్ సేఫ్టీ

- ఆహార నియంత్రణపై కరవు
- వేల సంఖ్యలో లైసెన్సు లేని దుకాణాలు
- ప్రజారోగ్యానికి ముప్పు



వారపు సంతలో ఆహార పదార్థాలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

నిడదవోలు: ఏదైనా ఆహార వ్యాపారం చేయాలంటే ఫుడ్ లైసెన్సులు తప్పనిసరి. కాని నిడదవోలు పట్టణంలో లైసెన్సులు లేని దుకాణాలు మార్కెట్‌లో రాజ్యమేలుతున్నాయి. తయారీదారులు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఆయా ఆహార పదార్థాల తయారీ తేదీ, ఎంత కాలంలో వినియోగించాలనే వాటిని ముద్రించకుండానే ఇష్టారాజ్యంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆహార పదార్థాల, తినుబండారాల విక్రయాలకు సంబంధించి ఆహారాల ప్రమాణాల సంస్థ నుంచి అనుమతులు పొందాలి. ఫాస్ట్‌ఫుడ్ స్టాల్స్, కర్రీ పాయింట్లు, బిర్యానీ సెంటర్‌లు, ఫుట్‌పాత్ హొటల్స్, కూల్‌డ్రింక్స్, మీల్స్ పాయింట్స్, చికెన్ సెంటర్లు, చేపలు, రొయ్యలతో కూడిన పదార్థాలు విక్రయించేవారు తప్పనిసరి అనుమతులు పొందాలి. కానీ ఏ వ్యాపారస్తుడు ఈ నిబంధనలను పాటించడంలేదు. రిజిస్ట్రేషన్‌తో కొందరే వ్యాపారాలు చేస్తుండగా పట్టణంలో, మరికొందరు అసలు రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. చాలామంది వ్యాపారులకు అనుమతులు తీసుకోవాలన్న సంగతే తెలియదు. దీనితో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, ప్రజా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది. తాజాగా ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలు విక్రయించే ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అలా చేయని పక్షంలో సదరు వ్యాపారులకు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించనున్నారు.

పట్టణంలో తనిఖీలు నిల్

పట్టణంలో ఆహార పదార్థాల కల్తీ నియంత్రణ శాఖ అధికారులు మచ్చుకైనా కనిపించరు. సుమారు పదేళ్ల నుంచి ఆహార పదార్థాల తనిఖీలు గాలికొదిలేశారు. గతంలో పురపాలకసంఘం పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఆహార తనిఖీ అధికారాలు ఉండేవి. 2011 నుంచి మున్సిపాలిటికి తనిఖీ అధికారాలను నిలుపుదల చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులకు మాత్రమే ఆహర పదార్థాల తనిఖీలు నిర్వహించే అధికారాలు ఉన్నాయి. దీంతో వారు తనిఖీలు చేపట్టపోవడంతో పట్టణంలో వ్యాపార దుకాణాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలేసి పలు వ్యాపారులు చేస్తున్న వ్యాపారాలపై అధికారులు తనిఖీలు నిర్వహించి నాసిరకంగా ఉన్న, కల్తీ వస్తువులను నిలువరించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో సంతమార్కెట్, ఓవర్‌బ్రిడ్జి, రైల్వేస్టేషన్ సెంటర్, బస్టాండ్ సెంటర్, పాటిమీద సెంటర్, గణపతి సెంటర్‌లలో అధికంగా ఫుట్‌పాత్ ఆహార పదార్థాల దుకాణాలలో నాణ్యత లేని సరకుతో తయారుచేసిన పదార్థాలు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ అధికారులు, ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించని వ్యాపార సముదాయాలపై తనిఖీ నిర్వహించి ఆహార నాణ్యత, ఆహార కల్తీలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నాసిరకం నూనెను వాడుతూ..

ఒకసారి వాడిన వంటనూనెను మరుసటి రోజు ఉపయోగించకూడదు. అయితే ఆహార నియంత్రణ వ్యవస్థ పట్టించుకోకపోవడంతో వ్యాపారులు వాడిన నూనెను మరలా వాడుతున్నారు. దీంతో ఆహర పదార్థాల నాణ్యత దేవుడు ఎరుక. ప్రజలకు దగ్గు, ఆయాసం, ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయి. తాడేపల్లిగూడెం, తణుకు, రాజమండ్రి నుంచి 100 లీటర్ల పీపాల ద్వారా నాణ్యత లేని నూనేను పట్టణానికి కొందరు వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. చిరు వ్యాపారుల నుంచి బడా వ్యాపారుల వరకు 15 లీటర్ల డబ్బాల ద్వారా నూనెను తక్కువ ధరకు కొనుగోలు చేసుకుని వాడుతున్నారు. తమ వ్యాపారాల అభివృద్ధి చేసుకోవడానికి, లాభార్జనతో ప్రజల ఆరోగ్యాలపై చెలగాటం ఆడుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు.

42 దుకాణాలకే అనుమతులు

పట్టణంలో వివిధ రకాల 42 మంది దుకాణాలకు మాత్రమే మున్సిపాల్టీ అనుమతులు ఉన్నాయి. అనధికారంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇంకా సుమారు 150 వరకు దుకాణాల ద్వారా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా ఫుడ్ సేఫ్టి అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్‌లు తప్పనిసరిగా పొందాలి. అయితే చాలా దుకాణాల వ్యాపారులు ఈ నిబంధనను అసలు పట్టించుకునే దాఖలాలు కనిపించటం లేదు.



ఆహర పదార్థాల తయారీ



రంగు కలిపిన వెజిటేరియన్ మీల్‌మేకర్

కల్తీతో ఆరోగ్యానికి అనర్థం



కల్తీ ఆహారం తినడం వలన ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది. కల్తీ నూనెతో కాళ్ల వాపు, వాంతులు, ఆయాసం వంటి వ్యాధులకు గురవుతాం. కిడ్నీ క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్ వంటి రోగాలు వస్తాయి. చిన్నపిల్లలకు ఎలర్జీస్, అస్తమా గురవుతారు. ఇంట్లో వినియోగించే నూనేను సైతం పది రోజులకోకసారి కొత్తరకం నూనేను వినియోగించాలి.

– డాక్టర్ ఫయాజ్ అహ్మద్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, నిడదవోలు

విద్యుత్‌కు నేడు అంతరాయం

నిడదవోలు: పట్టణంలోని విద్యత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు నిడదవోలు విద్యుత్ ఈఈ నారాయణ అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్నపూర్ణనగర్, ఎఫ్‌సీఐ గోదాము, డిగ్రీ కళాశాల, రామ్‌నగర్, ఓవర్ బ్రిడ్జి డౌన్, గాంధీ బొమ్మ సెంటర్, రైల్వేగేట్, బసివిరెడ్డి పేట, బాలాజీ నగర్, శాంతినగర్, సంజీవయ్యనగర్, బ్రాహ్మణగూడెం, దారవారం గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వ్యవసాయ వినియోగదారులకు త్రీఫేస్ కరెంటు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు, ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఈఈ నారాయణ అప్పారావు కోరారు.

అయ్యంకి సేవలు వెలకట్టలేనివి

పెరవలి: గ్రంథాలయ పితామహుడు, వ్యవస్థాపకుడు అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతి ఉత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ముక్కామల, పెరవలి, తీపర్రు శాఖా గ్రంథాలయాల వద్ద అయ్యంకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముక్కామలలో జరిగిన సభలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కడియాల సాయిరామ్ మాట్లాడుతూ గ్రంథాలయాలు అభివృద్ధి చెందితేనే ప్రజలకు విజ్ఞానం అందుబాటులోకి వస్తుందని నమ్మకంతో వీటిని అభివృద్ధి చేశారని అందుకు ఆద్యుడు అయ్యంకేనని కొనియాడారు. 1910లో మచిలీపట్నం ఆంధ్రభారతి సాహిత్య పత్రిక స్థాపించి స్వాతంత్ర్య లక్ష్యాలను ప్రచురించి ఎందరినో ఉద్యమకారులుగా తయారు చేసిన ఘనత ఆయనకే చెందిందని వివరించారు. ఏ ఉద్యమానికైనా నాయకులు లేరని, ఉన్నదల్లా కార్యకర్తలేనని చెప్పిన ధీశాలి అని కొనియాడారు. గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేసినందుకు పలుచోట్ల ఘనసత్కారాలు పొందడంతో పాటు గ్రంథాలయ పితామహుడు, సరస్వతీ రమారమణ, గ్రంథాలయ విశారధ, పద్మశ్రీ వంటి బిరుదులను పొందిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పాఠకులు, లైబ్రేరియన్‌లు వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, వెంకటేశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తడిగా మారిన రహదారులు



దేవరపల్లి–పల్లంట్ల రోడ్డులో వర్షపు నీటిలో వాహనదారుడి అవస్థలు



పోలవరం కుడికాలువ వంతెనపై నిలిచిపోయిన వర్షపు నీరు

దేవరపల్లి: కొవ్వూరు డివిజన్‌లోని మెట్ట ప్రాంతంలో గత రెండు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. 48 గంటలుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వరినాట్లు, కూరగాయల సాగు ముమ్మరంగా జరుగుతున్నాయి. చెరువుల్లో నీరు చేరడంతో ఆయకట్టు పొలాల్లో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. గురువారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా కుండపోత వర్షం కురుస్తుంది. వర్షాలకు గ్రామాల్లోని రహదారులు అస్తవ్యస్థంగా తయారయ్యాయి. డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దేవరపల్లి శివారున పోలవరం కుడి కాలువపై నిర్మించిన వంతెనపై వర్షం నీరు ఆగిపోవడంతో ప్రయాణీకులు అసౌకర్యానికి గురవుతున్నారు. దేవరపల్లి–పల్లంట్ల రోడ్డులో పోలవరం కుడి కాలువ వద్ద రోడ్డు గుంతలు పడి ధ్వంసమైయింది. వర్షం నీరు గుంతల్లో చేరడంతో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. దేవరపల్లి నుంచి లక్ష్మీపురం వెళ్లే గ్రావెల్ రోడ్డు బురదమయంగా తయారైయి, రాకపోకలకు అవస్థలు పడుతున్నామని దోమల వ్యాప్తి ఎక్కువైందని చర్యలు తీసుకొవాలని కొరుతున్నారు.

సారు.. ఏదీ దారి!

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి నుంచి ప్రక్కిలంక వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు గోతులు పడి అధ్వన్నంగా మారింది. ప్రభుత్వం, అధికారులు ఏ మాత్రం పటించుకోకపోవడంతో నిత్యం వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తుంది. తాళ్లపూడి బజార్ సెంటర్‌లో గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గోతుల్లో నీరు నిలిచిపోతుంది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో సమస్యగా మారి వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. తాళ్లపూడిలోని కొత్త బస్టాండ్ సమీపంలో చెక్కల మిల్లు, కాలువ గట్టు, ప్రక్కిలంక ఆటోనగర్, వివిధ ప్రాంతాల్లో రోడ్డు గోతులు పడి పరిస్థితి దారుణంగా ఉంది. ఈ మార్గం గుండా నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తాళ్లపూడి గడియారం సెంటర్ వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు

గ్రంథాలయ పితామహుడు అయ్యంకి

ఉండ్రాజవరం: గ్రంథాలయ పురోభివృద్ధికి విశేష కృషి చేసిన గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య అని రిటైర్డ్ ఆంగ్ల భాష ఆధ్యాపకుడు కోట రామప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితమహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య 135వ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటి సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమానికి అయ్యంకి విశేష సేవలు చేశారన్నారు. రిటైర్డ్ ఆంగ్ల భాష ఉపాధ్యాయుడు గజ్జరపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మారుతున్న సమాజంలో సాంకేతికాభివృద్ధికి అనుగుణంగా గ్రంథాలయాలు మార్పు చెందుతూ చదవరులకు విశేషమైన సేవలు అందిస్తున్నాయన్నారు. హిందీ ఉపాధ్యాయులు పెరుమాళ్ల రామదాసు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల జీవితాల్లో జ్ఞాన జ్యోతిని వెలిగిస్తున్నాయన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు ఆర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు సింహాద్రి శ్రీరామచంద్ర మూర్తి, తానేటి సుబ్బారావు, కోల్లాటి అప్పారావు, పచ్చిపులుసు శ్రీనివాసు, కెవి.కృష్ణారావు, వి.అనిల్, కామరాజు తదితరులు పాల్గొన్నారు.



అయ్యంకి రమణయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు, సభ్యులు

పోషక విలువలు ఉన్న ఆహారాన్ని పండించాలి

దేవరపల్లి: ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని విరివిగా పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు అన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గురువారం దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాల్లోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయకులకు, అధికారులకు స్థానిక గ్రామ సచివాలయం–3 వద్ద గల రైతు సేవా కేంద్రంలో మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 20 రకాల నవధాన్యాల విత్తనాలను సరఫరా చేస్తున్నట్టు ఆయన వివరించారు. ప్రకృతి వ్యవసాయాన్ని వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవడానికి కషాయాలను వాడాలన్నారు.



ఉద్యానవన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాధవరావు

పురుగు మందుల అవశేషాలు లేని పంటలను పండించి ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు, డీఆర్సీ ఏఓ వెంకన్నబాబు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల వ్యవసాయాధికారులు కె.కమల్‌రాజ్, కూచిపూడి ఏసుబాబు, బి.సోమశేఖరం సిబ్బంది పాల్గొన్నారు.

కొండాలమ్మకు సారె సమర్పణ



శాకంబరిగా దర్శనమిస్తున్న కొండాలమ్మ అమ్మవారు

పెరవలి: ఆషాఢ మాసం చివరి రోజు సందర్భంగా పెరవలి మండలం కానూరులో వేంచేసియున్న కొండాలమ్మ అమ్మవారికి గురువారం సారెను సమర్పించారు. కానూరు, నడుపల్లి, గ్రామాలకు చెందిన వేలాది మంది మహిళలు పిండి వంటలు, వివిధ రకాల స్వీట్లను కావెడలతో ఊరేగింపుగా తరలి వచ్చారు. ఈ మేరకు మహిళలు పెద్దఎత్తున తరలి రావడంతో సుమారు కిలోమీటరు వరకు జన సమూహమే కనిపించింది. శాకంబరిగా అమ్మవారిని అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి సారెను సమర్పించారు. అనంతరం వచ్చిన మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, స్వీట్లు అందించారు.



కానూరులో సారె పట్టుకుని వస్తున్న వేలాది మంది మహిళలు

ఆషాఢం సారె సమర్పణ

నిడదవోలు: ఆషాఢ మాసం చివరి రోజు పురస్కరించుకుని పట్టణంలోని స్థానిక రామకృష్ణ సేవ సమితిలో శారదా మాతకు గురువారం 108 రకాల పిండివంటలతో సారె సమర్పించారు. సన్నాయి మేళంతో గ్రామంలో ఊరేగింపుగా కావిడి సారెని ఆలయానికి తీసుకువచ్చారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి వేణునాగరత్నం, గీతా, సుభాషిని, ఉమా, సీతామహాలక్ష్మి, గీతారాణి, కస్తూరి, మనోహర్, వేదుల జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

దేవరపల్లి: దేవరపల్లిలో 11 కేవీ విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం దేవరపల్లిలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్. నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ మార్కెట్ ఫీడర్, మండల కేంద్రం ఫీడర్‌కు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన చెప్పారు. దేవరపల్లి, గొల్లగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వెల్లడించారు.

సోషల్ మీడియా ఆకర్షణకు లోను కావద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

తాళ్లపూడి: సోషల్ మీడియాలో వచ్చే వివిధ ప్రకటనలపై విద్యార్థులు ఆకర్షణకు లోనవ్వద్దని తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్‌కేజీఆర్, ఎస్ఎస్‌కే జూనియర్ కళాశాలల్లో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాలు, సోషల్ మీడియాకు సంబంధించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ, ఆండ్రాయిడ్ ఫోన్‌తో విద్యార్థులకు ఎన్ని ప్రయోజనాలున్నాయో, అంతే ప్రమాదాలున్నాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురవ్వవద్దని, ఆకర్షణకు లోనవ్వవద్దని సమాజంలో ఎక్కువ క్రైమ్స్ వీటితో ముడుపడి ఉంటున్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కరిబండి త్రినాథ స్వామి, ప్రిన్సిపాల్ పి.మురళి, వైస్ ప్రిన్సిపాల్ మాధవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంద సాగుపై రైతులకు అవగాహన



ఉద్యాన పరిశోధన కేంద్రంలో రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లను అందిస్తున్న శాస్త్రవేత్తలు

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరులోని ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానాన్ని గురువారం భారత దుంప పంటల పరిశోధన సంస్థ డైరెక్టర్ తిరువనంతపురం డాక్టర్ జి.బైజు, ప్రాజెక్ట్ కో– ఆర్డినేటర్ అఖిల భారత దుంప పంటల పరిశోధన సభ్యులు సందర్శించారు. ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బైజు షెడ్యూల్ కులాలకు చెందిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని కంద సాగులో సమస్యలను తెలుసుకుని వాటికి తగిన సలహాలను సూచించారు. రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు, సూక్ష్మ పోషక మిశ్రమాలను అందించారు. ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానంలో ప్రస్తుతం దుంప పంటలలో జరిగే పరిశోధన క్షేత్రాలను పరిశీలించి పరిశోధన ఫలితాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ డి.వెంకట్ స్వామి, శాస్త్రవేత్తలు లలిత కామేశ్వరి, మమత, రవీంద్ర కుమార్, స్నేహ లతారాణి వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.